# మరో ఫెయిర్ లేడీ

ఒక డోరియాల చీర రోడ్డుమీద వెళ్తాంటే "హల్లోవ్ సుబ్బులూ" అంటూ మావారు కిటికీ వూచల్నిపట్టుకు కేకెట్టారు.

హూ ఈజ్ దట్? అన్నా న్నేను.

నాట్ సీత, నాట్ రాధ, నాట్ కుసుమా ఆర్ కమలా బట్—

దట్ సుబ్బులూ ఈజ్ "మై ఫెయిర్ లేడీ" అన్నారు మావారు.

టట్— వీల్లేదు. వూచలు వంచకండి అన్నా— ఈ (గురుడి) వాలకం ఆట్టే పెద్దమనిషి తరహాగాలేదని పచ్చడి చేస్తున్నా, పప్పురుబ్బుతున్నా; అంట్లుతోమిస్తున్నా, అటక సర్దుతున్నా— ఒక కన్ను (ఓన్లీ ఒన్ ఐ) అటుకేసివుంచి రెండో కంటితో నా పని నేను చూసుగుంటున్నాను. అదేదో దిక్కుమాలిన సిన్మా చూసినప్పట్నుంచీ, మావారి రెండుకళ్ళు "మరో ఫెయిర్ లేడీ" కోసం వెతుకుతున్నట్లున్నాయి, ఫెయిర్ లేడీ గురించి మగాళ్ళు థింక్ చేయకుండా మనం అన్నిస్క్రూలు బిగించలేము కదా! కొన్ని స్క్రూలు వదులయాయేమో, పోనీ మనమే సరిపెట్టుకుందామంటే "మగబుద్ధి ప్రణయాంతకం" అని మొగుడ్ని కంట్రోలు చేయలేని ఆడది, గృహ బల్లి, గృహ దోమ, గృహ చీమ, గృహ ఈగ అవుతుంది కాని గృహలక్ష్మి ఎలా అవుతుంది? దేర్ ఫోర్ — ఈ మగాళ్ళు పైకి బుద్ధిమంతుల్లా, పత్నీవ్రతుల్లా కనిపించినా, లోపల కొంచెం కంత్రీలన్న విషయం మనం గుర్తుంచుకోవాలి. దోసకాయపప్పు ఎక్సెలెంటు అంటూనే దొండకాయ కూర చేసినందుకు తిడతారు.

కమింగ్ టు ది పాయింటు. హూ ఈజ్ దట్ సుబ్బులూ. అని అడిగేరు పాఠక్స్.

సుబ్బులూ ఈజ్ నాట్. జాంపండూ, చెరుకుముక్క, తేనెసీసా.. షి ఈజ్ నాట్ విజయలలితా ఆర్ బన్‌రొట్టె. నైదర్ కాంచన నార్ భారతి. ఆఫ్టరాల్ సుబ్బులు అనగా ఒక పనిమనిషి కూతురు. రెచడ్ పూర్ క్రీచర్. అది మా పిల్లను ఎత్తుకుమోసేది. నా వెలిసిపోయిన చినిగిన జాకెట్లు తొడుక్కునేది. నేనిచ్చిన పాతవే కట్టుకున్నా, అది అగ్గిమీద గుగ్గిలంలా వుండేది. కాని కాళిదాసు చెప్పిన అనాఘ్రాతపుష్పంలా వుండేది కాదని, మా వీథిలో సోడాలమ్మే కుఱ్ఱాళ్ళు చెప్తారని మావారు అంటారు. కోస్తున్నారు సార్ అన్నా. మన సోడాకుఱ్ఱాళ్ళకి సుబ్బులు బ్యూటీ గురించి తెలుస్తుంది కాని కాళిదాసు గురించేం తెలుస్తుంది సార్ అంటే నాకేసి గుడ్లురిమి చూశారు, మావారికి పిగ్మేలియన్ రాసిన "షా" మేనత్త కొడుకులా ఆలోచించడం వచ్చేసింది. డట్ (డర్టీ) సుబ్బుల్ని ఒక మహా రచయిత్రిగానో, నటిగానో, గొప్ప సొసైటీ లేడీగానో, తయారు చేసి అందర్నీ షాక్ చేయాలని వూహిస్తున్నట్లుండేవారు, దాని వేషం కట్టూబొట్టూ మార్చడం మీ తరవా (సోడాకుఱ్ఱోళ్ళారుకోరు) అని చెప్తే వినిపించుకుంటేనా? సరే యిలావుండగా, సుబ్బులూ యీజ్ మిస్సింగ్‌ఫర్ ది పాస్టు టూ డేస్ (అనగా సుబ్బులను పడుచుపిల్ల గతరెండురోజులుగా కనబడుటలేదు) ఎందుకెందుకని చూస్తూ వూరుకుంటే. ఈ మధ్య మావారు, రోడ్డుమీద నడిచివెళ్ళే రకరకాల స్త్రీలను పరకాయించి చూడ్డం, కట్టూబొట్టూ, నడక విలాసం, వయ్యారంగురించి కామెంటరీలు వినిపించడం, పనిమనిషి వస్తే కుర్చీలోంచిలేవడం, కూరలమ్మాయి కేక అల్లంత దూరంలో వినపడగానే వీథిలోకి ముందుగా వెళ్ళి నిలబడటం, పాలమ్మితో మాట కలపబోవడం చేస్తూవచ్చారు.

ఏమాట కామాటే చెప్పుకోవాలి. సుబ్బులూ యీజ్ అవర్ గైడింగ్ స్టార్.... ఇరుసున కందెన వేయక పరమేశ్వరు బండియైన పారదు సుమతీ! సుబ్బులు లేకపోతే దొడ్లో నాకూ తోచదు. అది ఎలక్ట్రిక్ వైర్....

సుబ్బులు కనపడకపోవడం ఒక పాయింటు. ఆ వంకన కిటికీ వూచల్ని పట్టుకు వ్రేలాడి డోరియాల చీరలు లెక్కపెట్టడం, రోడ్డుమీద పోయేఆడాళ్ళ ఆరాలుతీయడం, అప్పలమ్మలతో ఇంటర్వ్యూలుజరపడం, "నాన్సెన్స్" పనికిరాదంటాను.

మావారికి సుబ్బులంటే చాలా యిష్టం- మేకలా వుండేదాన్ని మేనకలా తయారుచేసింది వారే. చింపిరిజుట్టు, మట్టి వొళ్ళూ, చీమిడి ముక్కూ, చీకిరికళ్లూ, మోకాళ్ళకిందికి గౌను "సుబ్బులు" మాయింటికొచ్చినపుడు, అది గ్రాస్ గరల్‌లా మరీ డర్టీ స్మెల్ కొడ్తూ గజ్జికుక్కపిల్లలాగుండేది. ఏడేళ్ళో ఎనిమిదేళ్ళో.... మన మాట దానికి బోధపడేదికాదు. దాని మాట మనకు తెలిసేదికాదు. కిలుంపట్టిన యిత్తడి గ్లాసులా వుండే సుబ్బుల్ని, తళతళామెరిసిపోయే స్టీలు మరచెంబులాచేసిన ఘనత మాదే- అబద్ధాలు చెప్పడం, చేవాటుతనం లేకుండా జాగ్రత్తపడి దానికి కాస్త మంచీ, మర్యాదా మప్పేము. ఎలకలా మాడనివ్వకుండా తిండిపెట్టి పోషించి, కాస్త పనీ పాటా చెప్పి, శుచీశుభ్రతా అలవాటు చేసేము. మావారు మరో మెట్టు పైకెళ్ళి-- దానికి చిలక పలుకుల్లాంటి ఇంగ్లీషు ముక్కలు నేర్పారు. "గుడ్ మార్నింగ్" "థాంక్స్" "హౌ డు యుడూ" "ఓకే" "మై నేమ్ ఈజ్ సుబ్బులూ" "మే ఐ హెల్ప్‌యు" "ప్లీజ్" "ఆల్‌రైట్" "సారీ" యిలాంటి మాటల్ను కరెక్టుగా వాడడం దానికి నేర్పేరు. అక్షరజ్ఞానం, వంశక్రమానుగత సంస్కారం లేని పిల్లకు వినికిడివల్ల ఏమైనా అబ్బుతుందా-- అబ్బితే మనుష్యుల్ని త్వరత్వరగా మార్చొచ్చు. అలా మార్చకలిగితే, అప్పుడీ కులాలు గొప్పలూ, దర్జాలు జాబులమీద దెబ్బతీయొచ్చు. కొబ్బరిపుల్లలతో దానిని చురుక్కుమనేలా కొట్టి, అది ఏడిస్తే చాక్లెట్లు పెట్టి, యాసగా కేకలుపెడుతూ వికారంగా మాట్లాడ్డం దానిచేత మానిపించారు. అయ్యగారో-అమ్మగారో- లెగండి- తొంగున్నారు- కూకోండి- అయ్యబాబో- అమ్మనాయనో-సాలు-- సాపసపట- తెల్దు- నాకే ఎరిక, యిలా మాట్లాడితే తన్నినంత పనిచేసి తిండి పెట్టనని బెదిరించారు.

కతిపయ దినంబులు గడిచినంత- దానికి తలం టోయించి మంచి రూపశిల్పి (మేకప్ మాన్) ను తెచ్చి, స్వప్నసుందరి లాగ అలంకరింపచేసి, అప్టు డేట్ గరల్‌లాగా ముస్తాబుచేయించి, తన వెంటన్ సిరిలచ్చి వెంట అన్నట్టు థియేటరుకి తీసుకెళ్ళారు. ఆయన ముందుంటే అది వారి వెనక్కాల, వారిద్దరి వెనక్కాల నేనూ- వెళ్లేము. థియేటర్లో అంతా సుబ్బులుకేసి ఎగాదిగా చూడ్డం మొదలెట్టారు. ఎవరో అడిగితే దానిపేరు సుజాత అనీ. ప్రఖ్యాత నవలా రచయిత్రి అనీ. అది ఎక్స్‌జమీందార్ ఆఫ్ బంకంపేట, మరియు సంచలనచిత్రనిర్మాత రావు ఘూపతిరావు బహద్దర్ మేనకోడలనీ చెప్పారు. థియేటర్లో డ్రింకులు కొట్టే కుర్రాళ్ళు సుబ్బులుదాకావచ్చి స్టాపయిపోయేవారు.

తరువాత రెస్టోరెంటుకెళ్ళి ఏ. సి. లో లంచ్ కానిచ్చేము. అక్కడో సర్వరు సుజాతకేసి ఎగాదిగాచూస్తూ నిలబడిపోతే మావారు కోప్పడ్డారు. బేక్ టు పెవిలియన్.... ఇంటికొచ్చాక సుబ్బులు బావురుమని ఏడ్చింది చాప మీద చతికిలబడి-నాకు దాని అవస్థచూస్తే, చెప్పొద్దూ జాలేసింది. వ్హాట్ వ్హాట్ వ్హాట్ అంటూ వచ్చారు మావారు. అది ఒంటిమీదున్న ఎరువుసొమ్ము లన్నీ తీసి చాపమీద కుప్పగా పోసి, నేనిచ్చిన పాత డోరియాలచీర కట్టుగుంది. షి యీజ్ స్వీట్ సిక్స్టీన్, ఇది జరిగాక వారంరోజులకు ఒన్ ఫైన్ మార్నింగ్ సుబ్బులు అనేటువంటి పదహారేళ్ళ పడుచుపిల్ల, షి యీజ్ మిస్సింగ్, అనగా కనబడుటలేదు. నేను వాకబుచేశాను—అది దట్ స్వీట్ సుబ్బులూ మా వీథిలో సోడాలమ్మేకుర్రాడితో సినిమాహాల్లో, రిక్షాలో, కాకా హోటల్లో కనిపించిందని ఎవరో చెప్పారు. నేను మా వారికీ ఖోగట్టా చెప్పలేదు. అసలే ఆయన స్క్రూ లూజ్‌గావుంది. సుబ్బులు కోసం, డోరియాలచీరకోసం, మరో ఫెయిర్ లేడీకోసం, మావారు కిటికీ వూచల్ని పట్టుకు చూస్తూ వులికులికి పడుతూంటారు. మనుషుల్ని మనం మార్చలేం కనుక గురూగారూ, చుట్టూవున్న పరిస్థితుల్ని మార్చడానికి ట్రయిచేయడం గుడ్— బెటర్— బెస్టు !